క్లుప్తంగా

అన్నదానం



కడప కార్పొరేషన్: కడప నగరం సెంట్రల్ జైలు సమీపంలోని శ్రీ చౌడమ్మ వృద్ధాశ్రమంలో కంచర్ల శివప్రసాద్‌రెడ్డి, మహేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తల్లి కె. రాజేశ్వరి మూడో వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎం వి క్రిష్టారెడ్డి, డి. సుబ్బరాయుడు, శివశంకర్ హరినాథ్ రెడ్డి, వృద్ధాశ్రమ నిర్వాహకులు ఇస్మాయిల్, కంచర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డ్రమ్స్ వితరణ



మార్చ్‌పాస్ట్‌కు డ్రమ్స్‌ను వితరణగా ఇస్తున్న ఉపాధ్యాయురాలు సుకుమారి

కడప ఎడ్యుకేషన్: కడప అంగడివీధి పాఠశాలకు అదే పాఠశాలలో సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఎంఈ సుకుమారి రూ. 12 వేల విలువగల మార్చ్‌పాస్ట్ డ్రమ్స్‌ను బహూకరించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ అగ్గిరప్ప మాట్లాడుతూ ఈ డ్రమ్స్‌తో మార్చ్‌పాస్ట్‌కే కాకుండా విద్యార్థులకు కళాత్మకమైన నైపుణ్య విలువలను అవగాహన కల్పించవచ్చునని తెలిపారు.

18న క్యాంపస్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈ నెల 18వ తేదీ జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌కు నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రతినిధులు సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ పొజిషన్ అనే ఉద్యోగానికి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు హాజరుకావచ్చని తెలిపారు. ఉద్యోగ ఖాళీలు కడప, పొద్దుటూరు, రాజంపేట, రైల్వేకోడూరులలో పనిచేయవలసి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్, రెస్యూమ్‌లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సలీంబాష తెలిపారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కడప ఎడ్యుకేషన్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్), కడప శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ కడప శాఖ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరం వై.జంక్షన్ సమీపంలోని అష్టలక్ష్మీ కల్యాణమండపం వేదికగా ఈనెల 16వ తేదీ శనివారం ఉదయం 5 గంటలకు మంగళహారతితో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇస్కాన్ సంస్థాపకాచార్యులు అభయ చరణారవింద భక్తి వేదాంతస్వామి ప్రభుపాదుల ఆధ్వర్యంలో ఉదయం 5.40 గంటలకు మహామంత్రధ్యానం, 7.30 గంటలకు దర్శన హారతి, 8 గంటలకు శ్రీమద్భాగవతం, 9 గంటలకు గోపూజ, 10.30 గంటలకు కలిశాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. 10 సంవత్సరాలలోపు చిన్నారులు శ్రీకృష్ణుని, రాధాగోపిక అలంకారం వేసి తీసుకురావాలని, అలంకారంతో విచ్చేసే చిన్నారులకు సర్టిఫికెట్, బహుమతి, ప్రసాదం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 7.30 నుంచి రాత్రి వరకు రాత్రి 9 గంటల వరకు సర్వదర్శనం, 20 వేల మందికి ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

రెండోరోజు కార్యక్రమాలు..

ఈనెల 17వ తేదీ ఆదివారం శ్రీల ప్రభుపాద ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉదయం 5 గంటలకు మంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రవచనం, గురుపూజ హారతి మొదలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పర్మిట్ రూములకు అనుమతులు తప్పనిసరి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణ నిర్వాహకులు తప్పకుండా పర్మిట్ రూములకు అనుమతి తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 21 మద్యం దుకాణాలు ఉన్నట్లు సీఐ తెలిపారు. పర్మిట్ రూమ్ కోసం మున్సిపాలిటీ పరిధిలో రూ.7.50 లక్షలు, పంచాయతీ పరిధిలో రూ.5 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలని పేర్కొన్నారు. ముందుగా ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి పర్మిట్ రూమ్‌లకు రుసుం చెల్లించాలన్నారు. తర్వాత ఏడాది మొత్తానికి సంబంధించి ఒకే సారి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని సీఐ తెలిపారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 18, రూరల్‌పరిధిలో 3 మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. అలాగే పట్టణంలోని 8 బార్లకు త్వరలో టెండర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్వాతంత్య్ర ఫలం.. చేతికందిన క్షణం

- నేడు స్వాతంత్య్ర దినోత్సవం - వేడుకలకు సర్వం సిద్ధం



స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబయిన కడప నగరంలోని పోలీస్ పరేడ్ మైదానం

కడప సెవెన్‌రోడ్స్ : బ్రిటీషు వలస పాలన నుంచి దేశాన్ని విముక్తం చేసేందుకు తమ ప్రాణాలు తృణప్రాయంగా అర్పించిన త్యాగ ధనుల పుట్టినిల్లు కడపజిల్లా. స్వాతంత్య్ర సిద్ధి కోసం ఎందరో యువకులు నడుం బిగించి పోరాటంలోకి దూకారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల పిలుపునందుకుని సత్యాగ్రహాలు, సహాయ నిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలు నిర్వహించారు. పోలీసుల లాఠీలు, అరెస్టులు, చిత్రహింసలకు జడువక మొక్కవోని దీక్షతో పోరాటాలు సలిపి దేశ భక్తిలో కడప వారికి సాటీ లేరనిపించారు. అలా ఎందరో వీరుల త్యాగ ఫలమే నేటి స్వాతంత్య్రం. ఓమారు సింహావలోకనం చేసుకుంటే....

ఉయ్యాలవాడ తిరుగుబాటు

ఆధునిక చరిత్రకారులు, ప్రథమ స్వాతంత్య్ర సంగ్రామంగా కీర్తించే సిపాయిల పితూరికి పదేళ్ల ముందే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటీషు వలస పాలనకు వ్యతిరేకంగా మహత్తర సమరం సాగించారు. అప్పటికే ఆంగ్లేయుల దోపిడీ, పీడనలతో విసిగిపోయిన రైతాంగం ఆయన వెంట నడిచింది. ఐదు వేల మంది సైన్యంతో బ్రిటీషర్లపై తిరుగుబాటు నిర్వహించారు. కర్కశంగా ఆ తిరుగుబాటును అణిచివేసిన ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం 1847 ఫిబ్రవరి 22న ఉదయం 7.00 గంటలకు కోవెలకుంట్లలో నరసింహారెడ్డిని రెండు వేల మంది పైబడి ప్రజలు చూస్తుండగా ఉరి తీశారు. ఆయన సలిపిన పోరాటం జాతీయోద్యమానికి ఎంతో స్ఫూర్తినిచ్చింది.

షేక్ పీర్‌షా తిరుగుబాటు యత్నం

సిపాయిల తిరుగుబాటు ప్రభావంతో యల్లంపేటకు చెందిన షేక్ పీర్‌షా అనే అంధుడు బ్రిటీషు పాలకులపై తిరుగుబాటు యత్నాలు చేశారు. 1857 ఆగస్టు 28వ తేది మొహర్రం రోజు కడపలోని మద్రాసు 32వ రెజిమెంట్‌లో ఉన్న స్వదేశీ ఆఫీసర్లు, కంట్రోన్మెంట్ కాల్బలం ఆఫీసర్లను పురిగొల్పారు. తిరుగుబాటు దారుల కోసం ఆహార పదార్థాలు, డబ్బు సేకరించారు. తుపాకులకు పూసే గ్రీసు విషయంలో పంది, ఆవుకొవ్వు సెంటిమెంట్లను సిపాయిలలో రెచ్చగొట్టారు. అయితే షేక్ పీర్‌షాను ప్రభుత్వం అరెస్టు చేసి నామమాత్రపు విచారణ నిర్వహించి పదేళ్ల జైలుశిక్ష విధించి తిరునల్వేలి జైలుకు తరలించింది.

వందేమాతరం ఉద్యమం

1905లో ప్రారంభమైన వందేమాతరం ఉద్యమంలో జిల్లా ప్రజలు పాల్గొన్నారు. విదేశీ వస్తువులు బహిష్కరించారు. జిల్లా అంతటా సభలు, సమావేశాలు జోరందుకున్నాయి. 1908లో బిపిన్ చంద్ర పాల్ ఫోటోకు పూలమాల వేసి కడప వీధుల్లో ప్రదర్శనలు జరిపారు. పేద చేనేత కార్మికులకు ఉచితంగా మగ్గాలు బహూకరించారు. కడపలో జంగంకోట హరియప్ప, భద్రాచలం వెంకటేశ్వరరావు స్వదేశీ వస్త్రాలయాన్ని ఏర్పాటు చేశారు.

హోమ్ రూల్ ఉద్యమం

1916లో అనిబిసెంట్ చేపట్టిన హోమ్ రూల్ ఉద్యమం జిల్లాపై ప్రభావాన్ని చూపింది. దివ్యజ్ఞాన సమాజానికి చెందిన కొందరు హోమ్ రూల్ లీగ్ శాఖలను జిల్లాలో ఏర్పాటు చేశారు. బ్రిటీషు ప్రభుత్వ వైఖరికి నిరసనగా సభలు, సమావేశాలు జరిగాయి. 1918లో కడపలో వెంకటపతిరాజు అధ్యక్షతన మొదటి ఆంధ్ర ప్రావెన్షియల్ కాన్ఫరెన్స్ జరిగింది. సకాలంలో భారత దేశానికి అధికారాన్ని బదలాయించే విధంగా పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని బ్రిటీషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు.

ఖిలాఫత్ ఉద్యమం

1919 నుంచి ప్రారంభమైన ఖిలాఫత్ ఉద్యమ ప్రభావం జిల్లాలో కూడా చూపింది. అలీఘర్ ముస్లిం యూనివర్శిటీ నుంచి మహమ్మద్ హుసేన్, షఫీవుర్ రెహ్మాన్ అనే నాయకులు కడపకు వచ్చి ఉద్యమ కమిటీ ఏర్పాటు చేశారు. 1921 నవంబరు 21న హర్తాళ్ పాటించారు. కడప డిప్యూటీ మెజిస్ట్రేట్ 144 సెక్షన్ విధించి సభలు, సమావేశాలు నిషేధించారు. అలీఘర్ విద్యార్థి నాయకులకు ఆరు నెలల శిక్ష విధించి నెల్లూరు జైలుకు పంపారు.

మహాత్మాగాంధీ పర్యటన

జాతీయోద్యమానికి జిల్లా ప్రజలను సన్నద్ధం చేయడంలో భాగంగా మహాత్మాగాంధీ 1921 సెప్టెంబరు 30వ తేది, 1929 మే 17వ తేది, 1934 జనవరి 1వ తేది జిల్లాలో పర్యటించారు. రాయలసీమ కరువు బాధితుల సహాయం కోసం, స్వరాజ్య నిధి కోసం గాంధీజీ విరాళాలు సేకరించారు. విదేశీ వస్తు బహిష్కరణ, మద్యపాన నిషేధం, హిందూ-ముస్లిం ఐక్యత, అంటరానితనం నిర్మూలనపై గాంధీజీ ప్రధానంగా ప్రజలను చైతన్యపరిచే ప్రసంగాలు ఇచ్చారు. గాంధీజీ పర్యటన తర్వాత జిల్లాలో స్వాతంత్య్ర ఉద్యమం ఉవ్వెత్తున సాగింది.

మార్కెట్‌లో పంద్రాగస్టు సందడి

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పుర్కరించుకుని జిల్లాతోపాటు కడప నగరంలోని ప్రధాన మార్కెట్లు మువ్వెన్నెల జెండాలు, ఇతర సామాగ్రితో కళకళలాడాయి. కొన్ని దుకాణాలను పూర్తిగా జాతీయ జెండాలు, ఇతర అలంకార సామాగ్రితో నింపేశారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాలయాల్లో జాతీయ జెండాలు ఎగుర వేసేందుకు ఆ సంస్థల ప్రతినిధులు పెద్ద జెండాలు, ఇతర ముువ్వెన్నల అలంకార సామాగ్రి కొనేందుకు రావడంతో దుకాణాల్లో రద్దీ కనిపించింది. అనుకున్న వ్యాపారాలు జరగడంతో వ్యాపారులు సైతం సంతోషగా కనిపించారు.



విద్యార్థులు దేశభక్తిని అలవరచుకోవాలి

– డీఈఓ షేక్ షంషుద్దీన్



ఏడు రోడ్ల కూడలిలో జాతీయ జెండాతో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు దేశభక్తి అలవరచుకోవాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ సూచించారు. ముందస్తు స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా గురువారం కడప రాజారెడ్డివీధి నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు 150 మీటర్ల మువ్వన్నెల జెండాతో ర్యాలీని నిర్వహించారు. సంబంధిత ర్యాలీని డీఈఓ షంషుద్దీన్, కడప జిల్లా నారాయణ విద్యాసంస్థల ఏజీఎం శ్రీనివాసులు, కాలేజీ డీన్ చంద్ర కిషోర్‌రెడ్డిలు కపోతాలను వదిలి ప్రారంభించారు. ర్యాలీ రాజారెడ్డి వీధి నుండి 7 రోడ్స్ కూడలి వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం హరీష్, ప్రిన్సిపల్స్ ఆర్ ఎస్‌టి సంతోష్, భాగ్యనగర్ పాఠశాల కవిత రెడ్డి, ఏవో హేమంత్ రెడ్డి,, భార్గవ్ రెడ్డి, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



నాగార్జున మోడల్ స్కూల్లో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



లిటిల్ మాస్టర్ ప్లే స్కూల్లో వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడపలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో గురువారం ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులంతా శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణలో వచ్చి అలరించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ, గోపికల నృత్య ప్రదర్శన అలరించింది. ఉపాధ్యాయులు కృష్ణ జన్మాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవిలు విద్యార్థులకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియ చేశారు.

లిటిల్ మాస్టర్ ప్లే స్కూల్లో...

కడప ఎన్‌జీవో కాలనీలోని హైదరాబాద్ ది మాస్టర్ మైండ్స్ స్కూల్ లిటిల్ మాస్టర్స్ ప్లే స్కూల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులంతా కృష్ణుడు, యశోద, గోపికల వేషధారణలో వచ్చి అందరిని అలరించారు. ఈ సందర్భంగా బాల గోపాలుడిని ఊయలలో ఉంచి ఊపుతూ లాలిస్తూ ఆడిస్తూ జోలపాటలు పాడారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ అండ్ కరస్పాండెంట్ స్వర్ణలత పాల్గొన్నారు.

రంగవల్లుల పోటీలు



రంగవల్లులను తీర్చిదిద్దుతున్న మహిళా ఉద్యోగులు

కడప కార్పొరేషన్ : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని శంకరాపురంలో ఉన్న ట్రాన్స్‌కో నిలయంలో ఏపీ ట్రాన్స్‌కో మహిళా ఉద్యోగులకు గురువారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జి.రాజేశ్వరి ప్రథమ బహుమతి సాధించగా, హైమావతి, కస్తూరి ద్వితీయ బహుమతి, శైలజ, సాయికుమారిలు తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీరు డాక్టర్ కృష్ణకుమార్, ఎస్‌ఈలు శ్రీనివాసరావు, సీఎస్‌ఆర్ మూర్తి, కె.శ్రీనివాసరావులు పర్యవేక్షించి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో సుమారు 15 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, కల్చరల్ సెక్రటరీ వీరభద్రయ్య, మస్తాన్, విద్యావతి, ప్రశాంతి పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఓడింది



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట సుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజా స్వామ్యం ఓడిపోయిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో టీడీపీది బలుపు కాదని వాపేనన్నారు. ఎన్నో అక్రమాలు, అరాచకాలు, బూత్‌లను ఆక్రమించుకొని రిగ్గింగ్ చేసుకొని విజయం సాధించారని, ఈ మాత్రానికే బాణసంచా పేల్చడం, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకోవడం ప్రపంచంలో ఎనిమిదో వింత అని ఎద్దేవా చేశారు. పులివెందుల, ఒంటిమిట్టలలో టీడీపీ గెలుపు పోలీసులు, ఎన్నికల కమిషన్, కిరాయి గూండాలకే దక్కుతుందన్నారు. పులివెందుల జెడ్పీటీసీ పరిధి లో పది వేల ఓట్లు ఉంటే దానికి ఒక డీఐజీ, ఎంపిక చేసిన డీఎస్పీలు, సీఐ, ఎస్‌ఐలు, వందలాదిమంది పోలీసులను మోహరింపజేసి, వారి ద్వారా వైఎస్సార్ సీపీ వారిని, ప్రజలను ఓటింగ్‌కు రానీయకుండా నిలువరించారన్నారు. ఇన్ని అక్రమాలతో గెలిచి న్యాయం, ధర్మం గెలిచిందని చెప్పడం దారుణమన్నారు. 1995 స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గెలిచిందని, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలకు వైఎస్ఆర్ కుటుంబం సహకరించబట్టే గెలిచిందన్నారు. 40 ఏళ్లుగా వైఎస్ కుటుంబం స్థానిక సంస్థల్లో టీడీపీ వారిని నామినేషన్ వేయించలేదని విషం చిమ్మడం సిగ్గుచేటన్నారు. ఆగస్టు 2017న నంద్యాల ఉప ఎన్నికల్లో ఇలాగే గెలిచారని, ఆ తర్వాత 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 సీట్లలో ఘనవిజయం సాధించిందని గుర్తు చేశారు. దమ్ము, ధైర్యం ఉంటే పారా మిలిటరీ దళాలతో, కేంద్ర ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఎం. ఓబయ్య యాదవ్, ఆర్. నాగేశ్వర్ రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఘన సన్మానం



బుఖారియా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సయ్యద్ సలీం బుఖారిని సన్మానిస్తున్న సభ్యులు

కడప ఎడ్యుకేషన్: కడపలోని బుఖారియా ఎడ్యుకేషనల్ సొసైటీ నూతన ప్రెసిడెంట్ గా సయ్యద్ సలీం బుఖారి ఎన్నికయ్యారు. గురువారం నగరంలోని అమీన్ పీర్ రోడ్ లో ఉన్న బుఖారియా ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ మొహమ్మద్ బుఖారి మాట్లాడుతూ పూర్వ ప్రెసిడెంట్ సయ్యద్ అక్బర్ బుఖారి దివంగతులైనందున ఆయన స్థానంలో వారి తనయుడు సయ్యద్ సలీం బుఖారిను సొసైటీ ప్రెసిడెంట్‌గా సభ్యులు ఎన్నుకున్నారన్నారు. అనంతరం సొసైటీ నూతన ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సయ్యద్ సలీం బుఖారిను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ సంఘం షేక్ నసీరుద్దీన్, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ మొహమ్మద్ బుఖారి ట్రెజరర్ ఎస్ కె కలిముద్దీన్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

అపరిచితులతో పరిచయాలు వద్దు

మైదుకూరు : సోషల్ మీడియాలో పరిచయమయ్యే కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అలాంటి వారితో పరిచయాలు పెంచుకోవద్దని అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులందరూ సోషల్ మీడియాపై అవగాహనతో ఉండాలని సీఐ పేర్కొన్నారు. సోషల్ మీడియా పరిచయాలు తాత్కాలికమేనని అన్నారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. వరుస సెలవులు కారణంగా ఎవరైనా ఊర్లకు వెళుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు. వీధుల్లో, ఇళ్ల వద్ద మోటార్ బైక్‌లకు సైడ్ లాక్ తప్పనిసరిగా వేసుకోవాలన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



లోలెవల్ కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరదనీరు

సిద్దవటం : మండలంలో పెన్నా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నా నదిపై ఉన్న లోలెవల్ కాజ్‌వే మీదుగా వరదనీరు ప్రవహిస్తోందని సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ పెన్నా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లోతట్టు గ్రామాలైన జ్యోతి, వంతాటిపల్లె, ఎస్.రాజంపేట, జ్యోతి గొల్లపల్లె, ఆకుల వీధి, గాండ్లపాలెం మరి కొన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెన్నానది వద్దకు ఎవరూ వెళ్లవద్దన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చేపలు పట్టేవారు నదిలోకి వెళ్లవద్దని ఆయన హెచ్చరించారు.

17న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీరామ్ నగర్‌లోని శ్రీభద్రావతి భావనారుషి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రొద్దుటూరు పట్టణ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు అగ్గారపు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. హోలిస్టిక్ ఆస్పత్రి వైద్యులు రాజశేఖర్ వర్మ, హరీష్ బాబు, నాగేశ్వర్ రెడ్డి, బీఎల్ఎన్ రెడ్డి వైద్య సేవలు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8 సచివాలయాల్లో 154 పింఛన్ల కోత

చాపాడు: మండల పరిధిలోని 8గ్రామ సచివాలయాల పరిధిలో 154 మందికి చెందిన పింఛన్లను ప్రభుత్వం తొలగించింది. గత రెండు నెలల క్రితం దివ్యాంగ, పెరాలసిస్ పింఛన్ దారులకు ప్రభుత్వం పరీక్షలు నిర్వహించింది. ఈ క్రమంలో గురువారం వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో తొలగించిన పింఛన్‌దారుల జాబితాలు వెలువడ్డాయి. మండలంలోని బద్రిపల్లె సచివాలయం పరిధిలో 30, సోమాపురం పరిధిలో 28, అయ్యవారిపల్లె పరిధిలో 8, ఎస్.ఓబాయపల్లె పరిధిలో 26, చాపాడు పరిధిలో 12, అన్నవరం పరిధిలో 14, పెద్దగురువళూరు పరిధిలో 4, చిన్నగురువళూరు గ్రామ సచివాలయం పరిధిలో 30 మంది పింఛన్లు తొలగిపోయినట్లు ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులు తెలియజేశారు.